ఘనంగా మొహర్రం వేడుకలు

జిల్లాలో బుధవారం కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు 10 రోజుల నుంచి ఉపవాస దీక్షలతో ఆయా గ్రామాల కూడళ్ల వద్ద పీరీలను ఏర్పాటు చేసి, పూజలు చేశారు. షర్బత్ పంపిణీ చేసి, దీక్షలు విరమించారు. ఈ సందర్భంగా ఊరూరా పీరీలను ఊరేగించారు. ఆయా చోట్ల పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే పలువురు ప్రముఖులు పీరీలను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

మంచిర్యాల ఏసీసీ/మంచిర్యాలటౌన్/రెబ్బెన/కాగజ్‌నగర్ రూరల్/పెంచికల్‌పేట్/దహెగాం/తాండూర్/హాజీపూర్/కెరమెరి, జూలై 27

హాజీపూర్ : పీరీల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రెబ్బెన : శ్రీ భువమ్మతల్లి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

- మంచిర్యాల పట్టణంలోని వేంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్దగల గోసే సులేవాక్‌లో పీరీలను ఏర్పాటు చేసి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెరువుల వద్దకు తీసుకవెళ్లి శాంతింపజేశారు.
- రెబ్బెన మండలం పుంజుమేరగూడని శ్రీ భువమ్మ తల్లి దేవస్థానంలో గల పీరీలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కుండలో మలీద, షర్బత్ తీసుకవచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోవ అరుణ, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షురాలు కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ పందిర్ల వినోద, పల్లె రాజేశ్వర్‌రావు, దుర్గం భరద్వాజ్, పందిర్ల మధునయ్య, దేవస్థానం అధ్యక్షుడు వినోద్‌జైస్వాల్, వ్యవస్థాపక అధ్యక్షుడు నికోడే శ్రీకర్, సభ్యులు శ్రీకాంత్, నిమ్మాజీ, భగవాన్, రాకేశ్, వెంకటి, రాజు, చింటు, కాంతారావు, భీంరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పీరీల బంగ్లాల వద్ద ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు.
- మంచిర్యాల పట్టణంలోని చెన్నూర్ గేట్ సమీపంలో పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ముస్లిం మత పెద్దలతో కలిసి ఐదోవార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీచేశారు. అనంతరం పీరీలకు మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముజావర్, ఖాజా, కలీం, ముమైత్‌ఖాన్, శకు, యూసుఫ్, షకీల్, ప్రభాకర్, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.
- కాగజ్‌నగర్ మండలంలోని బారేగూడలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డప్పు చప్పుళ్ల నడుమ ఆటపాటలతో పీరీలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో దేవార వినోద్, మల్లేశ్, నందయ్య, మెంగాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.
- పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూరు, ఎల్కపల్లి, కొండపల్లి, చెడ్వయి గ్రామాల్లో వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పీరీలను ఊరేగించారు. ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.
- దహెగాం మండలంలోని ఆయా గ్రామాల్లో పీరీలకు భక్తులు మలీద ముద్దులను నైవేద్యంగా సమర్పించారు. ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.
- తాండూర్ మండల కేంద్రం, మాదారం, ఆయా గ్రామాల్లోని దర్బార్లలో పీరీల వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తాండూర్, ఐబీ ముస్లిం యూత్ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ చేశారు. తాండూర్ సీఐ కే కుమారస్వామి ఆధ్వర్యంలో ఎస్ఐ సీహెచ్ కిరణ్‌కుమార్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.
- మండల కేంద్రంతో పాటు, వేంపల్లి, నర్సింగాపూర్, గుడిపేట, టీకన్నపల్లి గ్రామాల్లో పీరీల ఊరేగింపు నిర్వహించారు. నర్సింగాపూర్‌లో జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు నయిం పాషా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.
- కెరమెరి మండల కేంద్రంలో డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ పీరీలను ఊరేగించారు. భక్తులు ముడుపులు కట్టి మొక్కులను తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

జిల్లాలో బుధవారం తొలిఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని చోట్లా ప్రజలు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా చోట్ల గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. దీంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కొందరు ఇళ్లలో విష్ణుమూర్తి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. - పెంచికల్‌పేట్/జన్నారం/తాండూర్/కన్నెపల్లి/వేమనపల్లి/చెన్నూర్‌టౌన్/నెన్నెల/నస్పూర్, జూలై 17

పెంచికల్ పేట్ : ఎల్కపల్లి అభయాంజనేయాలయంలో ప్రత్యేక పూజలు

వేమనపల్లి : నీల్వాయి శివాలయంలో ..

- పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని అభయాంజనేయ ఆలయంలో స్వామివారికి పాలకుర్తి విష్ణు తేజ ఆచార్యులు ఆధ్వర్యంలో పంచామృతం స్నానం చేయించారు. ప్రత్యేక పూజలు,అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.
- జన్నారం మండలంలో భక్తులు ఉదయాన్నే గోదావరికి వెళ్లి, పుణ్యస్నానాలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొందరు ఇంటి విష్ణుమూర్తికి ప్రత్యేపూజలు చేశారు.
- మాదారంలోని కోదండరామాలయంతో పాటు, మండలంలోని పలు ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు పూజలు చేసి పసుపు, కుంకుమ, కొబ్బరి సమర్పించి, మొక్కులు చెల్లించారు.
- కన్నెపల్లి, భీమిని మండలాల్లోని ఆయా గ్రామాల్లో గల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్నెపల్లిలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామిదేవాలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు.
- వేమనపల్లి మండల కేంద్రంతో పాటు, నీల్వాయి, జిల్లెడ, జక్కెపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్‌కుమార్ నీల్వాయిలోని శివాలయం, వెంకటేశ్వరాలయాల్లో పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేశారు. మాజీ సర్పంచు గాలి మధు, మాజీ ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.
- చెన్నూర్ పట్టణంలోని శివాలయం, జగన్నాథ, పలు ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉత్తరవాహిణి గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. ఉపవాస దీక్షలు చేసి, రాత్రంతా జాగారణ చేశారు. అంబా అగస్తేశ్వరాలయంలో బ్రాహ్మణోత్తములతో అభిషేకాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది. శివాలయంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 24 గంటలు (అహోరాత్రులు) అభిషేకాలు నిర్వహించారు. రుద్రం, నమకం, చమకంలతో శివున్ని ఆరాధించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎం శ్రీనివాస్, కే రాజేశ్వర్ రావు, సభ్యులు కేవీఎం ప్రకాశ్ రావు, పురాణపు శంకర్, పులి శంకర్, బ్రాహ్మణోత్తములు వేమారపు మహేశ్వర్ శర్మ, కొమ్మెర శ్రీమూర్తి, గట్టు అగస్తేశ్వర శర్మ, పులి సందీప్, చింతభట్ల కృష్ణ సాయి, శ్రీరాంభట్ల మురళి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.
- నెన్నెల, మైలారం, కుష్నపల్లి, ఆవుడం చిత్తాపూర్, గొల్లపల్లి, ఘన్‌పూర్, కొత్తూర్, గంగారం, జండా వెంకటాపూర్ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. భజనలు, పూజలతో ఆలయాలు నిండిపోయాయి.
- నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్, జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకులు రైల్వేస్టేషన్, బస్టాండ్ సమీపంలోని యాచకులకు అన్నదాన నిర్వహించారు. నేతకాని స్టూడెంట్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ పాల్గొన్నారు.

బాలుర డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణకు చర్యలు

నస్పూర్, జూలై 17 : మహాత్మా జ్యోతిబాపూలే బాలుర డిగ్రీ కళాశాల తరగతుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మంచిర్యాలకు కళాశాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 17 అడ్మిషనుల రావడంతో డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు నిర్మల్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి మంచిర్యాలలో డిగ్రీ కళాశాల కోసం తగిన భవనాన్ని గుర్తించి, తరగతులు స్థానికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్
- తాండూర్, మాదారం పోలీస్ స్టేషన్ల తనిఖీ

పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

తాండూర్, జూలై 17 : పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారిలో నమ్మకం కలిగించేలా విధులు నిర్వర్తించాలని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ పేర్కొన్నారు. తాండూర్, మాదారం పోలీస్ స్టేషన్లను బుధవారం బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల పరిసరాలతో పాటు, రిసెప్షన్ సెంటర్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పనితీరు, సమస్యలను తెలుసుకున్నారు. బాధ్యతాయుతంగా ఉంటూ తమ తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో భౌగోలిక పరిస్థితులు, మైన్స్, ముఖ్యమైన ప్రదేశాలు, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే వాటిని, ఎలా నియంత్రించాలనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. డే అండ్ నైట్ పెట్రోలింగ్, విజబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బీట్లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు, లా అండ్ ఆర్డర్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తాండూర్ మండలంలో భూ వివాదాలు, కుటుంబ కలహాల కేసులు సహజంగా కనిపిస్తున్నాయన్నారు. నియంత్రణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పల్లెనిద్ర, పట్టణాల్లో కాలనీల నిద్ర పేరుతో కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌ను పరిశీలించి, ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐ కుమారస్వామిని ఆదేశించారు. డీసీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐ సీహెచ్ కిరణ్ కుమార్, మాదారం ఇన్‌చార్జి ఎస్ఐ తిరుమల ఉన్నారు.

బోనమెత్తిన జోగిని శ్యామల

అమ్మవారికి పూజలు చేస్తున్న జోగిని శ్యామల

మంచిర్యాల అర్బన్, జూలై 17 : జిల్లా కేంద్రంలోని హమాలీవాడలో గల కట్టపోచమ్మ బోనాల జాతర వేడుకలను నల్లకోటమ్మ-లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్, 13వ వార్డు కౌన్సిలర్ నల్ల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ వేడుకలకు హైదరాబాద్ నుంచి జోగిని శ్యామల హాజరయ్యారు. హనుమాన్ ఆలయం నుంచి అమ్మవారి వేషధారణలో నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ కట్టపోచమ్మ దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి అమ్మవారికి కుంకుమ, పసుపు, చీరే, సారే, నైవేద్యాలను సమర్పించారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు కొడుకుకోడలు చరణ్‌బాబు-శైలేఖ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణాధ్యక్షుడు తూముల నరేశ్, కౌన్సిలర్లు, నాయకులు, అలయ అర్చకుడు సంగర్స్ సంతోష్ శర్మ, కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మంచిర్యాల అర్బన్, జూలై 17 : మంచిర్యాల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆనంద నిలయం వృద్ధుల ఆశ్రమంలో బుధవారం గట్ల వాసుదేవ రెడ్డి కుమారుడు మాస్టర్ అధీరా నందన్ జన్మదిన పురస్కరించుకొని రూ.33 వేలు సాయం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OLD AGE HOME
★ ఒంటేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

'రాష్ట్ర కమిటీని బర్తరఫ్ చేస్తున్నం'

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 17 : అనుమతులు లేకుండా 14వ తేదీన నియమించిన రాష్ట్ర కమిటీని బర్తరఫ్ చేస్తున్నట్లు కొలావార్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ భవన్‌లో బుధవారం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలన్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 3 పునరుద్ధరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అప్పుడే ఆదివాసులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీ రద్దుచేయాలని, అదనపు పోస్టులతో కొత్త డీఎస్సీ వేయాలని, ఆదివాసుల కోసం ప్రత్యేక డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. కొలావార్ సంఘంలో కొంతమంది సంఘాన్ని నిర్వీర్యం చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, ఆదివాసులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సలహాదారు నాంపల్లి శంకర్, ఉపాధ్యక్షులు పోచం, గోపాల్, రాజన్న, జిల్లాలోని నాయకులు పాల్గొన్నారు.

మాదారంలో తాగునీటికి కటకట

ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న సింగరేణి యాజమాన్యం

- చెడిపోయిన విద్యుత్ మోటర్
- కొనసాగుతున్న మరమ్మతు పనులు

తాండూర్, జూలై 17 : మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో రెండు రోజుల నుంచి తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొంది. ఎంవీకే-1ఇంక్లైన్ నుంచి ఫిల్టర్ బెడ్‌కు నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్ చెడిపోవడంతో సమస్య తలత్తింది. దీంతో సింగరేణి యాజమాన్యం ప్రత్యామ్నాయంగా ట్యాంకుల ద్వారా కార్మికకాలనీలకు నీటిని సరఫరా చేస్తున్నది. సంబంధిత అధికారులు విద్యుత్ మోటర్ మరమ్మతులను వేగవంతంగా చేపడుతున్నారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడి మృతి

జైపూర్, లూలై 17 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెలిశాల మల్లన్న గుడి సమీపంలో ఈ నెల 11న రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ చెన్నూర్ పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు సూరం బ్రహ్మరెడ్డి బుదవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడని జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే-6లో కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్న బ్రహ్మరెడ్డి, 11న మొదటిషిఫ్టు విధులు ముగించుకొని బైక్‌పై చెన్నూర్ వెళ్తుండగా, ఓ ట్రాలీ వెనుక నుంచి అతివేగంగా ఢీ కొట్టింది. తీవ్రగాయాలవగా సింగరేణి దవాఖానకు, ఆ తర్వాత కరీంనగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. బ్రహ్మరెడ్డికి భార్య లక్ష్మి, ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్

రెబ్బెన, జూలై 17 : రైతులందరికీ ఎలాంటి షరతులూ లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. రెబ్బెన మండలం దుగ్గాపూర్ గ్రామంలో బుధవారం పలువురు రైతులతో కలిసి పంటలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు షరతులు విధించడం రైతుల అశలపై నీళ్లు చల్లడమేనని పేర్కొన్నారు. రుణమాఫీ అమలుపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూస్తే అర్హులను తగ్గించడంపైనే ఎక్కువగా దృష్టిపెట్టినట్లు అర్థమవుతున్నదన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మాడావి జంగు, కుడిమేత పైకు, మాడావి దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ కమాండెంట్ బదిలీ

కమాండెంట్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

హాజీపూర్, జూలై 17 : హాజీపూర్ మండలంలోని గుడిపేటలో ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ జమీల్ బాష 3వ బెటాలియన్ కమాండెంట్‌గా బుధవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమాండెంట్‌ను శాలువాతో సన్మానించి, పూల మొక్క అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసులు అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ నీతీనిజాయతీ, పారదర్శకతో పనిచేస్తూ ధనిక, పేద తేడా లేకుండా ప్రజలను సమానంగా చూసి, మన్నలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అస్టింటెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, ఆర్ ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధ చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం

సీసీసీ నస్పూర్, జూలై 17 : నస్పూర్ గోదావరికాలనీ షిర్డీ గీతా ప్రశాంతి నిలయంలో అర్ధ చాతుర్మాస్య మండల దీక్షలు ప్రారంభమయాయి. శ్రీశ్రీశ్రీ శ్రీహరి మౌనస్వామి పాల్గొని భక్తులకు దీక్ష ఇచ్చారు. గీతా మందిర్‌లో ప్రవచనాలు చేశారు. సెప్టెంబర్ 15న విరమణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమద్భగవద్గీత సత్సంగం వెల్ఫేర్ సోసైటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్య

లక్షెట్టిపేట, జూలై 17 : లక్షెట్టిపేట పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో బోళ్ల వ్యాపారి శిశోద్యల ప్రతాప్ సింగ్(55) ఆర్థిక ఇబ్బందులు తాలలేక దుకాణంలోనే ఉరేసుకున్నట్లు ఎస్ఐ సతీశ్ బుధవారం తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యులు సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతాప్ సింగ్ తన భార్య ఉమతో కలిసి బోళ్ల వ్యాపారం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా వ్యాపారం సరిగా సాగకపోవడంతో కొందరి వద్ద అప్పు తీసుకున్నాడు. ఈ మధ్య ముగ్గురితో కలిసి వ్యాపారం చేసి సుమారు రూ.30 లక్షల వరకు లాస్ అయ్యాడు. వ్యాపారికి కూడా సుమారు రూ.కోటికిపైగానే ఇతరుల నుంచి డబ్బు రావాల్సి ఉంది. తనకు రావాల్సిన డబ్బు సమయానికి రాకపోవడం, తాను తీసుకున్న వ్యక్తులకు ఇస్తానన్న సమయానికి ఇవ్వకపోవడంతో మనోవేదనకు గురై, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే తాను తీసుకున్న అప్పుతో పాటు, తను వ్యాపారం చేసిన వారి పేర్లు, తనకు డబ్బు ఇవ్వాల్సిన వారి పేర్లు సూసైడ్‌నోట్‌లో రాసి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

రెబ్బెన, జూలై 17 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని శ్రీ రామచంద్ర మిషన్ యోగాశ్రమం అభ్యాసకులు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల శ్రీ రామచంద్ర మిషన్ యోగాశ్రమం (హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం)లో బుధవారం తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం ఆశ్రమం చుట్టూ వివిధ రకాల మొక్కలు నాటారు. పలువురు అభ్యాసకులు ఉన్నారు.

వర్షం.. హర్షం

చెన్నూర్, జూలై 17 : పట్టణంలో రెండ్రోజులుగా మోస్తరు వర్షం కురుస్తున్నది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరుచేరింది. మురుగు కాలువలతో పాటు, రోడ్లపై వర్షపునీరు పారుతున్నది. పెద్ద చెరువు, కుమ్మరి కుంటలకు నీరు చేరుకుంటున్నది. రైతులు వ్యవయసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

వాంకిడిలో..

వాంకిడి, జూలై 17 : మండలవ్యాప్తంగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. రైతులు వ్యవసాయ పనులకు వెళ్లకుండా ఇంటికే పరిమితమయ్యారు. ప్రజలు చెరువులు, వాగుల వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వారణాసిలో వాసవీ భజన మండలి

బెల్లంపల్లి, జూలై 17 : శ్రీ వాసవీ భజన బృందం సహాయక సంఘం ఆధ్వర్యంలో శృంగేరి ఆస్థాన ప్రవచకులు బ్రహ్మశ్రీ బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి సహకారంతో వారణాసిలో కాశీ ఖండం ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కాశీ ఖండం ఆచారాలు, సంప్రదాయాలను సమగ్రంగా వివరించారు. కాశీ ఖండంలో చేయాల్సిన వ్యవహారాలు, దర్శించదగిన పుణ్యకార్యాలయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భజన కార్యక్రమ అధ్యక్షుడు చిలువేరు దయాకర్, సభ్యులు అంజన్న, నందయ్య, సిద్ధంశెట్టి శ్రీనివాస్, రేణిగుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యం కోసం సాయం

నెన్నెల, జూలై 17 : ఆవుడం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు వెలగటూరి లక్ష్మణ్ ఇటీవల ప్రమాదవశాత్తు గోడ కూలి తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కావడంతో వైద్యం చేయించుకునే స్థితిలో లేక పోవడంతో విషయం తెలుసుకున్న కొవిడ్ వలంటీర్స్, సోపతి వెల్ఫేర్ సోసైటీ సభ్యులు తమ వంతుగా రూ.19,051 సాయం అందించారు. సభ్యులు జలం పెల్లి శ్రీనివాస్, నీలాల శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.